

# ఎన్.టి.ఆర్ పురాణ పాత్రలు

– డా. నందమూరి లక్ష్మీపార్వతి



డా.లక్ష్మీపార్వతిగారు డాక్టరేట్ కోసం సమర్పించిన సిద్ధాంతగ్రంథం **‘ఎన్.టి. ఆర్ పురాణపాత్రలు - భారతీయ పురాణ సంప్రదాయం చలనచిత్ర శైలీకరణ‘** నుంచి ఎంపిక చేయబడిన కొన్ని భాగాలు - కౌముది పాఠకులకోసం ప్రత్యేకం..!!

(గత సంచిక తరువాయి)

**చిత్రకథ ప్రారంభంలో** మహర్షులంతా యజ్ఞం చేస్తుంటారు. నారదుడు అక్కడకు వస్తాడు. ‘హవిర్భోక్త‘ ఎవరని ప్రశ్న వచ్చినప్పుడు ఇంద్రుడని సమాధానం చెపుతారు. ఇంద్రుడు దురాచారుడు. అతడు పనికి రాడని నారదుడు చెబితే త్రిమూర్తులు సరైనవారని భావిస్తారు. త్రిమూర్తుల్లో శ్రేష్టుడెవరో పరీక్షించడానికి భృగువు మొదట బ్రహ్మలోకం చేరుకుంటాడు. సరస్వతీ మధుర వీణానాదంలో మునిగి వున్న బ్రహ్మ అతడిని లెక్కచేయలేదు. భృగువు కోపంతో భూలోకంలో పూజలు లేకుండా శపించి కైలాసం వెళ్తాడు. అక్కడ పార్వతి పరమేశ్వరులు ఆనందతాండవం చేస్తూ మహర్షిని పట్టించుకొనకపోయేసరికి భూలోకంలో పట్టెడు నీళ్ళు, బిల్వపత్రం, బూడిద తప్ప వేరే దొరక్కుండా శపించి వైకుంఠం వెళ్తాడు. ఆ సమయానికి లక్ష్మీనారాయణులు చాలా ఆనందంలో మునిగి ఉన్నారు. రామారావుగారు కృష్ణుడు తర్వాత విష్ణువుగా కనిపించే మొదటి చిత్రం ఇది. చాలా అందంగా నప్పారు. ముఖంలో దేవదేవుడి కుండవలసిన గాంభీర్యం అద్భుతసౌందర్యం తొణికిసలాడుతున్నాయి. ఎస్. వరలక్ష్మిగారు కూడా లక్ష్మీదేవిగా బాగా నప్పారు. ఆమె సొంతగొంతుతో ఈ సందర్భంలో పాడిన పాట హిట్టయింది. శ్రీదేవినీ నీదు దేవేరినీ ఏనాటికీ నీకు నాకు ఎడబాటు లేదు అని ప్రతీకాత్మకంగా ముందు వియోగాన్ని సూచిస్తుంది. నారాయణమూర్తి భృగువు కోసం కొంటె చూపులు చూస్తుంటాడు. వారిరువురు భృగువును పట్టించుకోరు. కోపంతో భృగువు శ్రీ మహావిష్ణువు వక్షస్థలంపై తన్నాడు. లక్ష్మీదేవి తీవ్రమైన కోపంతో వెళ్ళిపోయింది.

"నా తప్పుమన్నించి నన్ను గరుణ
జూచియా దివ్యమణిమయ స్ఫూర్తిదనరు
రుచిర సింహాసనమున గూర్చుండు దివ్య
తాపసోత్తమ యభయ ప్రదాన నిపుణ"

అంటూ తనను తన్నిన తపస్విని కూర్చుండబెట్టి సకల మర్యాదలు చేస్తాడు. "కఠిన కౌస్తుభాలంకారమైన నా వక్షస్థలంబు తాకి నీ మృదు పదములెంత నొచ్చెనో, " అని అతి మృదువుగా అంటాడు. చిరునవ్వు చెడకుండా మృదుగంభీరంగా మాట్లాడడం రామారావుగారికే చేతనవును. కృష్ణుడికి మాట్లాడేటప్పుడు ఒక పద్ధతి. ఆ వైవిధ్యం తన నటనలో స్పష్టంగా చూపించగలిగారు.

రామారావుగారు చాలా సందర్భాల్లో మాడ్యులేషన్ కోసం తానెంత కష్టపడి సాధన చేసేవారో చెప్పారు. ఉగ్రమైన పాత్రలకు లలితమైన పాత్రలకు వారి శరీరంలాగే స్వరం కూడా మార్పుచేసుకోవటం విశేషం. నటుడు కావాలనే కోర్కెతో మద్రాసు వెళ్ళిపోయినా ఆ రంగంలో కాలుమోపాక అహరహం శ్రమిస్తూ తనలో ఒక మహానటుడిని తీర్చిదిద్దుకుని తెలుగు చిత్ర లోకానికి కళాభిమానులకు అందించారు. అదొక తపస్సు, ప్రతి పాత్రకు తన శైలిలో సంభాషణలు తనే స్వయంగా రాసుకుని చదువుకునేవారు. దుస్తులు, ఆభరణాలు వారే ఎన్నిక చేసేవారు. ప్రతి పౌరాణిక పాత్ర వారి చేతిలో మెరుగులు దిద్దుకునే తెరముందుకు వచ్చింది. అందుకే ఆ పాత్రలు సజీవాలు. వారికి భగవంతుడిచ్చిన వరం అసమాన్యమైన సౌందర్యం.

భృగువు అహంకారం దిగిపోతుంది కానీ, తన ప్రదేశాన్ని తన్నినందుకు లక్ష్మీదేవి అలిగి భూలోకం వెళ్ళిపోతుంది. లక్ష్మీలేని వైకుంఠంలో నిముషముండలేక శ్రీమన్నారాయుణుడు సామాన్యుడిలాగా ఆమెను వెతుకుతూ భూలోకానికి వస్తాడు. అసలు కథ ఇక్కడనుండి ప్రారంభమవుతుంది. "లక్ష్మీ! నన్ను మన్నించవా! ప్రియా నన్ను ఏకాకిని చేసి వెళ్ళకు దేవి" అంటూ బ్రతిమలాడే సన్నివేశంలో రామారావుగారి ముఖంలో ఒక గొప్ప ప్రేమికుడు కనిపిస్తాడు. వియోగాన్ని భరించలేక పడే ఆవేదన కూడా  బాగా వ్యక్తీకరించగలిగారు. తెలుగులో ఉన్న ఒక సామెత. వెంట్రుకల్నున్నమ్మ ఏ కొప్పు పెట్టినా చెల్లుతుంది అని అందమైన ఆ ముఖంలో ఏ భావమైనా హాయిగా ఒదిగిపోయింది. భావాలకదే పుట్టిల్లయినట్టు.

ఆమెను వెతుకుతూ వెళ్ళి ఒక వల్మీకంలో ఉంటాడు. బ్రహ్మ, ఈశ్వరుడు గోవుగా దూడగా మారి ఆ పుట్టలో పాలు పితుకుతారు. గోవు ప్రతిరోజు పుట్టలో పాలు వదలటం చూసి శరభుడనే కాపరి ఆవును కొడితే అది నారాయణుడికి తగులుతుంది. అతడిని రాక్షసుడు కమ్మని శపించి నెత్తురు కారుతున్న నుదుటితో తూలుకుంటూ వకుళాదేవి ఆశ్రమం చేరుకుంటాడు.

పుల్లయ్యగారి సతీమణి శ్రీమతి శాంతాదేవిగారు ఈ పాత్రను బాగా పోషించారు. ఆమె స్వయంగా పాడిన ఈ పాట భక్తిత్వత్వాన్ని పండించింది.

"ఎన్నాళ్ళని నా కన్నులు కాయగ ఎదురు చూతురా గోపాలా
ఎంత వేడినా ఎంత చూచినా ఈనాటికి దయరాదేదా
వెన్న మీగడలు జున్ను పాలకు ఏమి కొరతరా మన ఇంట
పాలను ముచ్చిలి పరుల చేతిలో దెబ్బలు తినకురా
ఈ తల్లి మనసు ఓర్వలేదయ్యా!.. ఎన్నాళ్ళని"

నిజంగా ఈ పాట గొంతుతో కాక గుండెతో పాడినట్లే ఉంటుంది. ప్రతి సన్నివేశం భక్తి రసార్ద్రత, శ్రీనివాసుడక్కడికి వస్తాడు. అమ్మా అన్న ఆ పిలుపులో ఎన్ని యుగాలు ఎడబాటు, ఎంత ఆర్ధ్రత పలికించాలో రామారావుగారికే తెలుసు. ఆ మాటలకు ప్రతి మాతృహృదయం పులకరిస్తుంది.

"నాయనా! ఎవరు నీవు.? "

"నేనా? ఏమని చెప్పను. ఒంటరివాడను నేను. కన్నవారు లేరు. ఎల్లరు నా వారే. తొల్లికలదు సిరి. నేడదియు లేదు. " అని తనను పరిచయం చేసుకుంటాడు. నిండైన విగ్రహం, కనులకింపైన రూపం సరిగా ఆ సందర్భంలో నేపథ్యవాద్య సంగీతంగా "వెడలెను కోదండపాణి" అనే కీర్తన పెట్టటంలో రాముడు శబరిని కలుసుకున్న సన్నివేశాన్ని దర్శకుడు మనోజ్ఞంగా గుర్తు తెచ్చారు.

"అమ్మ ఏ పేరుతో పిలిస్తే అదే నా పేరు. అమ్మా! ఈ జన్మకు ఇదే తొలిసారి. అమ్మచేతి భోజనం నీ చేతి చలువ" ఇటువంటి సంభాషణలు గుండె కదిలింపచేస్తుంది. తరువాత ఆకాశరాజు కూతురు పద్మావతిని చూసి ప్రేమించటం, తల్లిని మధ్యవర్తిగా పంపటం, వారిద్దరి వివాహం, నారదుడు ముల్లోకాలకు వెళ్ళి శ్రీనివాస కళ్యాణం గురించి చెప్పడం  జరుగుతుంది. అలాగే శ్రీనివాసుడికి కుబేరుడికి

ధనసహాయమడగమని చెబుతాడు. కాసుల వర్షం కురిపిస్తాడు. శ్రీనివాసుడు మాటిస్తాడు. కలియుగాంతం వరకు వడ్డీ చెల్లిస్తానని, వివాహ సన్నివేశాన్ని దర్శకుడు చాలా చక్కగా తెలుగు సంప్రదాయానుసారంగా చిత్రీకరించారు. సెట్టింగ్స్ చాలా బాగా వేసారు. పెళ్ళికుమార్తె కుమారుడి వేషాల్లో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో పేర్లు చెప్పుకునే తెలుగు సంప్రదాయాన్ని మర్చిపోలేదు. అక్కడ నారదుడు లక్ష్మీదేవికి చెబుతాడు నారాయణుడు మరో స్త్రీని వివాహమాడానని. మూలకథకు ఇది భిన్నంగా ఉంది. ఆమె వచ్చేలోపు పద్మావతీ శ్రీనివాసుల వివాహ దృశ్యం. "కలగా కమ్మని కలగా" అనే పాట కమ్మని సంగీతంతో, ప్రకృతి పులకరించినట్లుంటుంది.

"పద్మా! " అనే పిలుపులోనే అనంత ప్రేమ తత్త్వాన్ని పలికించినట్లుంటుంది. అద్భుతమైన ఆ ప్రకృతి దృశ్యం. ఎంతో మనోహరంగా కొండలు, జలపాతాలు, పూలవనాలు, చల్లగాలి, చిత్రం ద్వారా కథ చెప్పడమంటే అదే అనిపిస్తుంది.

లక్ష్మీదేవి వచ్చి దుఃఖించడం, లక్ష్మీ, పద్మావతుల సంవిధానం నివారించలేని శ్రీనివాసుడు శిలగా మారిపోతాడు. కొత్త పెళ్ళికూతురు కుమిలి కుమిలి ఏడవటం చూసి లక్ష్మీదేవి జాలిపడుతుంది. అష్టదిక్పాలకులు నడుగుతుంది. ఆమెకు అన్యాయం జరిగిందని, సృష్టినే అల్లకల్లోలం చేస్తానంటుంది. బ్రహ్మ ఈశ్వరుడు వచ్చి వారిస్తారు. ఇదంతా జగన్నాటక సూత్రధారి లీల. వేదవతి కారణంగా శ్రీనివాసుడిగా అవతరించవలసి వచ్చిందని పాప పంకిలమైన లోకాన్నుద్ధరించటానికి కలియుగాంతం వరకు స్వామి ఇక్కడే ఉంటాడని చెబుతారు.

నారదుడు వేంకటేశ్వర స్తోత్రం చేస్తాడు. వకుళాదేవి మాలగా మారి శ్రీనివాసుని కంఠసీమనలంకరిస్తుంది. కలియుగ స్వామిగా పూజలందుకుంటున్న వేంకటేశ్వరుని గొప్ప భక్తుల్లో ఒకడు బావాజీ. పురోహితులతనినడ్డగించిన కారణంగా, బావాజీ తన కుటీరంలో ఉండి శ్రీనివాసుని దర్శనానికై తపిస్తుంటాడు. అప్పుడు బాలాజీ స్వయంగా నివాసానికి వస్తాడు.

ఈ సన్నివేశాన్ని ఎంత అద్భుతంగా తీసారంటే, పౌరాణిక చిత్ర సినీ ప్రపంచంలో మరో మారు అది సాధ్యంకాదు. వేంకటేశ్వరస్వామి విగ్రహం నుండి రామారావుగారు రావటం భక్తలోకం మూర్ఛపోయేటట్లు చేసింది. మెడలో వకుళమాల, పెదవులపై చిరునవ్వు, పట్టు పీతాంబరాలతో ఒంటినిండా నగలతో నుదుటిన నామాలతో ఆ రూపం ఎంత చూసినా తనివి తీరదు. ఒక నటుడికి ఇంతటి అపూర్వమైన అలౌకికార్షణ ఎలా సాధ్యం అనిపిస్తుంది.

బాలాజీ బావాజీతో పాచికలాడడం, తరువాత అతన నగ వదిలి వెళ్ళటం, అతడిని అపరాధిగా భావించి చెరసాల్లో పెట్టటం, బండెడు చెరుకులు తెల్లవారే సరికి తినేయటం శ్రీనివాసుని లీలలుగా చూపించారు.

చివరకు గుళ్ళో దేవుడే మాయమైతే పూజారులంతా అది మాయావి అయిన బావాజీపని అని ఆరోపణలు చేస్తారు. చివరికి శ్రీనివాసుని అనుగ్రహంతో బావాజీ మహాభక్తుడిగా గుర్తింపబడతాడు. ప్రతియేటా కైంకర్యం వారి వంశీకులే చేయాలని మహారాజు నిర్ణయిస్తాడు.

కొండకు వస్తున్న భక్తులను దొంగలు దోచుకుంటారు. స్వామి ముడుపులు తెస్తున్న ఒక కుటుంబాన్ని దొంగలు కొట్టి ఆ సొమ్మును కూడా కాజేస్తారు. "నీ సొమ్ము నీవే కాపాడుకో" అంటాడు భక్తుడు. ముడుపుల చెంబే వాళ్ళను చావబాది భక్తుడి దగ్గరకు చేరుకుంటుంది. దొంగల్లో మార్పు వస్తుంది.

"పదవే పోదాము గౌరీ, బంగారు గౌరీ" అనే జానపద పాట చక్కని ప్రజాదరణ పొందింది. స్వామి మహిమలు, దర్శనం, స్వామివారి పూజలు కుంభాభిషేకం స్వామివారి ఉత్సవాలు. ఇవన్నీ భక్తుల్ని ఏదో లోకాలకు తీసుకెళ్ళాయి. తిరుపతి వెళ్ళలేని చాలామంది ఈ చిత్రం ద్వారా స్వామి ఉత్సవాలు చూసి తరించారు. అందువల్లే ఆ రోజుల్లో ఈ చిత్రాన్ని ప్రదర్శించే థియేటర్లన్నీ తిరునాళ్ళలాగా మరాయి. ఈ చిత్రానికి మరో గొప్ప ఆకర్షణ ఘంటసాల వేంకటేశ్వరరావుగారు. గుళ్ళో స్వామి వారి ఎదుట కూర్చుని స్వయంగా పాడడం. "శేషశైలవాసా శ్రీ వేంకటేశా కరుణించు మామయ్య శ్రీ చిద్విలాసా" అనే పాట తెలుగుదేశమంతటా నినదించింది. ఇప్పటికీ కొండనెక్కే భక్తుల్ని పలకరిస్తోంది. తెలుగులో వెలువడ్డ భక్తిరస ప్రధాన చిత్రాల్లో శిరోతిలకం లాగా వెలువడింది ఈ చిత్రం.

మాయాబజారు కృష్ణుడి కంటే వేంకటేశ్వరస్వామిగా రామారావుగారికి ఎక్కువ పేరు వచ్చిన చిత్రం ఇది. ఆ తరువాత పౌరాణిక పాత్రలకు ఆయన వెనక్కు తిరిగి చూసుకోవలసిన పనిలేకుండా పోయింది.

### *శ్రీ సత్యనారాయణ మహాత్మ్యం*

1964లో సత్యనారాయణ మహాత్మ్యం చిత్రం తీయబడింది. కె.గోపాలరావుగారి నిర్మాణ దర్శకత్వం పర్యవేక్షణలో నిర్మించబడ్డ ఈ చిత్రం ప్రేక్షకాదరణలకు నోచుకోలేదు. సత్యనారాయణ వ్రతం, చాలా ముఖ్యమైందిగా తెలుగు సంప్రదాయమున్నా, అప్పటికే అపర నారాయణమూర్తిగా రామారావుగారు ప్రజల్లో పేరు తెచ్చుకున్నా చిత్రం అపజయంపాలుకావటానికి కారణం చిత్రకథలోని లోపాలు, తెరపై కథనం చేసే తీరులో వెలితి..

నిజానికి నారాయణమూర్తిగా మిగిలిన అన్ని సినిమాలకంటే రామారావుగారు ఒప్పుకోవటం సరైంది కాదేమో అనిపించింది. ఒక దానికొకటి పొంతనలేని సన్నివేశాలతో అయోమయంగా తయారైన కథ, పరిణతిలేని దర్శకత్వం ఈ సినిమాకు మంచి ప్రతిష్ట తీసుకురాలేకపోయింది.

"జయజయ నారాయణ" అనే పాటలో నారాయణమూర్తి దశావతారాలన్నీ చూపించబడతాయి. విష్ణుభక్తులైన ఒక కుటుంబానికి స్వామి వరప్రసాదం ఒక శిశువు రూపంలో లభిస్తుంది. బిడ్డలు లేని ఆ దంపతుల ఆనందానికి మేరలేదు. 'సత్యదాసని' నామకరణం చేసి అపురూపంగా పెంచుతుంటారు.

మూర్ఖుడైన ఆ దేశపు రాజు తానే దైవమని మరో దేవుడిని పూజించవద్దని రాజ్యంలో కట్టడి చేస్తాడు. శివకేశవ మహారాజు ఆజ్ఞను అతిక్రమించి విష్ణు ప్రార్ధనలు చేసే వారిని రాజభటులు శిక్షిస్తుంటారు. అదే విధంగా సత్యదాసుని, అతడి తండ్రిని కూడా బంధిస్తారు. ఆ దృశ్యం చూడలేక తల్లి అడ్డుపడితే ఆమెను చంపేస్తారు. రాజు పిల్లవాడిని, తండ్రిని బంధిస్తాడు.

భూదేవి తన బాధలు విష్ణువుతో మొరపెట్టుకుంటుంది. నారదుడి చాడీల వలన లక్ష్మీదేవి విష్ణువు మీద ఆగ్రహిస్తుంది. విష్ణుస్వరూపం పరిపూర్ణంగా ఉంది. దీని మూలకథ ఎక్కడుందో తెలియదు. బహుశా సత్యనారాయణస్వామి స్థలపురాణం కావచ్చు. శంఖుచక్రాలతో రూపొందించబడ్డ కిరీటం చెవుల వరకు ఉంది. నాలుగు చేతుల్లో ఆయుధాలతో, మెడలో లావుపాటి గుండ్లతో కూర్చిన మాల మెడవరకు జుట్టు శ్రీమన్నారాయణ మూర్తిని కళ్ళెదుట నిలబెట్టినట్టే ఉంది.

భూదేవి మాట వినవద్దని లక్ష్మి అంటుంది. పూర్తిగా లక్ష్మితోనే గడుపుతూ తనని అన్యాయం చేసారని భూదేవి బాధపడుతుంది. లోకకళ్యాణం కోసం భూదేవి దుఃఖం తీర్చటం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం భూమికి రావాలంటుంది భూదేవి. స్వామి తన సొంతం. ఇక అవతారాల ప్రసక్తే లేదని వాదిస్తుంది. సవతుల పోరులో ఎటూ తేల్చుకోలేక నారదుడిని భూలోకానికి పంపిస్తాడు విష్ణువు. అసలు ఈ కథకే అర్ధం లేదు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments